నిరుద్యోగం

కోటేశ్వర్రావు తన కుర్చీలో కూర్చుని డ్రాయరు తాళంచెవులకోసం జేబు తడుపుకుంటుండగా ఆఫీసు కుర్రవాడు వచ్చి "మిమ్మల్ని మేనేజరుగారు రమ్మంటున్నారు" అన్నాడు.

కోటేశ్వరరావు గుండె చిన్న అడుగేసింది. మేనేజరుగారు రమ్మంటున్నారనే వార్త కోటేశ్వర్రావుకు ఓ తెరలాంటిది. దాని వెనుక ఏ బూచు లున్నాయో తెలీదు. ప్రతిసారి మేనేజరు చీవాట్లు పెట్టడానికే పిలువడు. అయినప్పటికీ, పాతకాలపు వాళ్ళకి, టెలిగ్రాం వచ్చిందంటే ఎంతభయమో కోటేశ్వర్రావుకు మేనేజరు పిలుపంటే అంత భయం. చిన్నప్పటినుంచి అతనికి కీడెంచి మేలెంచే అభ్యాసం. ఈ భయం ఇక్కడితో ఆగక ఆ ఆఫీసు కుర్రాణ్ణి చూసినప్పుడల్లా కూడా అతని గుండె చిన్న అడుగేస్తూ ఉంటుంది. వాడు మేనేజరుగారి ప్రత్యేక నౌకరు. ఒక అశుభవార్త లాంటి వాడు. వాడు తానున్నచోటికి వచ్చినప్పుడల్లా వాడు వచ్చినది తనకోసం కాదని రూఢియైనదాకా, కోటేశ్వరరావు గుండె చిందు తొక్కుతూనే ఉంటుంది.

గబగబాలేచి కోటేశ్వరరావు మేనేజరు సమక్షానికి వెళ్ళాడు. మేనేజరు తల ఎత్తిచూసి "ఓ, వచ్చావా? కూర్చో!" అన్నాడు. "తమరు నన్ను మందలించటానికి పిలవలేదులెండి, అది నాకు తెలుసులెండి!" అన్నట్టుగా కోటేశ్వరరావు మేనేజరుకేసి ఒక నవ్వు పారేశాడు. ఇది అతనికి మామూలే.

"నువ్వీ ఆఫీసులో మూడేళ్ళపైగా పనిచేస్తున్నావు. ఆఫీసు సంగతులు నీకు తెలియనివికావు. క్రిందటేడు ఎట్లాగో నష్టం లేకుండా బయటపడ్డాం. కాని ఎవరికీ బోనసు లివ్వలేకపోయాం. అక్కడికదే ఎంతో దిగజారుడనిపించింది. ఎందుకంటే 1949 లో మనం నాలుగేసి నెలల జీతాలు బోనసిచ్చాం. ఆ రోజులు అయిపోయాయి. ఇక రావు. ఈ యేడు మనం ఖచ్చితంగా నష్టంలో పడుతున్నాం. రిట్రెంచిమెంటు లేకుండా చూద్దామని చాలా ఆలోచించాం. కాని లాభం లేకపోయింది. జీతాలివ్వలేని పరిస్థితి కూడా ఏర్పడబోతున్నది. అందుచేత—"

మేనేరుగారు డ్రాయరులోంచి ఒక చిన్న కవరు పైకి తీశాడు.

"ఈ మూడేళ్ళూ నువుచాలా శ్రద్ధగా పనిచేశావు. నీపనిలో నిజానికి ఏలోపమూ లేదు. కాని-పరిస్థితులు చెప్పానుగా? ఇదిగో-ఈ నెల జీతమూ, నోటీసుకు బదులు మూడు నెల్ల జీతము ఇస్తున్నాను. అదృష్టం ఉంటే రేపీపాటికి ఇంతకన్న మంచి ఉద్యోగం దొరకవచ్చు."

మేనేజరు అందించే కవరు తీసుకోటానికి కోటేశ్వరరావు చెయ్యి జంకింది. అది ముట్టుకున్న మరుక్షణం తన కేసు పునర్విచారణకు అవకాశం కాస్తా జారిపోతు న్నట్టు భయం వేసింది. "నా ఒక్కడి జీతం ఆఫీసుకు బరువయిందా? ఎంతో విశ్వాసంగా పనిచేశాను. ఏ లోపం చెయ్యలేదు. బయటకూడా ఆఫీసును గురించి ఎన్నడూ అగౌరవంగా మాట్లాడ లేదు—" తానేమంటున్నదీ కోటేశ్వరరావుకే తెలీదు.

"అంతా నిజమే. కాని ఈ విధంగా నిర్ణయం జరిగిపోయింది. ఇంకో రహస్యం కూడాచెపుతాను. నా నమ్మకం ఈ రిట్రెంచిమెంటు తాత్కాలికమేనని. జనవరి నుండి ఆఫీసు పరిస్థితి కాస్త చక్కబడుతుందనే ఆశఉంది. అది జరగగానే మళ్ళీ మనుష్యులను వేస్తాం. నీకే మొదటి అవకాశం ఉంటుంది. అయితే ఈ మాట వాగ్దానంగా మటుకు భావించవద్దు."

"మీరు తలుచుకుంటే—"

"నావల్ల అయేది ఏమీలేదు. ఇక నువ్వు వెళ్ళవచ్చు."

కోటేశ్వరరావు కవరు తీసుకొని పరధ్యానముగాచిప్పి చూసుకున్నాడు. లోపల నోట్లున్నాయ్. అవితీసి లెక్కపెట్టటం అతనికి సాధ్యంకాలేదు. లోపలి కోటుజేబులో కవరు దాచిపెట్టి "జ్ఞాపకం ఉంచుకోండి. నేనింకే ఉద్యోగంకోసం ప్రయత్నించను. వీలు దొరకగానే కబురుచేయండి!" అన్నాడు.

మేనేజరు, "ఓ అట్లాగే" అన్నాడు. ఆయన ఏదోచిరునవ్వు ఆపుకుంటున్నట్టు కోటేశ్వరరావుకు అనిపించిందిగాని అది భ్రమ అయిఉండాలి. తన దుస్థితిని చూచి మేనేజరు ఎందుకు నవ్వవలసి వస్తుంది? తమకేం శత్రుత్వమా?

మేనేజరు గదివెలుపల నౌకరు కుర్రాడు కనిపించాడు. ఈ ఆఫీసుకు తనకన్న, వాడు అవసరం కావటం — తాను ఉద్యోగం మానిన ఇంకో ఆరు నెలలకు వాడింక ఇక్కడే యథాప్రకారం మేనేజరు బెల్ కొట్టినప్పుడల్లా హాజరవుతూ, మేనేజరు ఎవ రిని పిలవమంటే వాళ్ళని యములవాడల్లే పట్టుకెళ్ళుతూంటాడన్నభావం—కోటేశ్వర రావుకు విచిత్రంగా తోచింది. తనకు ఉద్వాసన! ఆలోచిస్తే ఏదో అబద్ధంలాగాఉంది. పోనీ తాను శేషాచలమల్లే అసమర్థుడైతే! లేదూ, నారాయణమూర్తిలాగా చాటున అమ్మ ఆలి బూతులు తిట్టేవాడైతే! అదేంకాదే.... ఒక రోజు మేనేజరు తనని పిలిచి ఎట్లా మెచ్చుకొన్నాడు! "ఈ ఆఫీసులో నీవంటివాళ్ళిద్దరుంటే చాలు. ఎంతపని అయినా సాధించగలం" అన్నాడు. ఆ సంఘటన తలచుకుంటేనే ఈ క్షణంలో కోటేశ్వర రావుకు శరీరం వెచ్చగా అయిపోయింది. పోయిన విజయదశమికి ఆఫీసులో ప్రసాదం అదీ తయారు చేశారు. ఈ మేనేజరే "కోటేశ్వరరావుకు ప్రసాదం అందినట్టులేదు!" అన్నాడు. "లేదండి, నేను ముందే పుచ్చుకున్నా!" నన్నాడు తాను ఎంతో కృతజ్ఞ తతో.... ఇదంతా అబద్ధమే? అసంభవం! తన జీవితంతో ఈ ఆఫీసుకు ఇంత తలవని తలంపుగా రుణం తీరిపోయిందా? వొట్టిది. ఇది నిజంగా తాత్కాలికమే. జరిగిన మూడు సంవత్సరాల ఉద్యోగము జ్ఞాపకం తెచ్చుకుంటే తనకూ ఈ ఆఫీసుకూ గల

సంబంధం ఆదర్శవంతమైనదిగా కనిపించింది — చచ్చిపోయిన క్షణంలో భార్యను గురించి భర్తకు అన్నీ మంచి విషయాలే జ్ఞాపకం వచ్చినట్టు.

కోటేశ్వరరావు తన సీటు దగ్గరికిరాగానే ఇద్దరు ముగ్గురు గుమాస్తాలు మూగారు. ఏదో జరిగిందని తెలిసిన వాళ్ళల్లే ఆదుర్దాగా "ఏమిటీ? ఏమి జరిగింది?" అని అడిగారు. వాళ్ళామాట అనగానే ఎందుకో కోటేశ్వరరావు పీక ఎవరో నొక్కేసినట్టయిపోయి కళ్ళు చెమ్మగిల్లాయి. నోట మాట రాలేదు.

"అయిపోయింది. వెళ్ళవచ్చునన్నారు."

"నే చెప్పలా?" అన్నాడు శ్రీరాములు మిగిలిన వాళ్ళకేసి తిరిగి "దొం—లం—కొ!" అన్నాడు. నారాయణమూర్తి అందుకున్నాడు—"కాళీఅయిన సిరాబుడ్డినీ అవతల పారేసినట్టే. మంచీ, చెడ్డా, న్యాయం, ధర్మం, సబబూ, సందర్భం—ఏమీ అక్కర్లా! కారణం ఏమీ అక్కర్లా! కారణం అక్కర్లా!"

కోటేశ్వర్రావు మేనేజరును సమర్థిస్తూ మాట్లాడసాగాడు. నారాయణమూర్తి మాటలు అతనికి ఉత్సాహం ఇవ్వక కాదు. కాని తాను మేనేజర్ని సమర్థించటం నారాయణమూర్తికి చాలా అవసరంగా తోచింది. "జీతాలివ్వలేని పరిస్థితికూడా ఏర్పడింది. రిట్రెంచిమెంటు చెయ్యక చస్తారా?"

"అదివరకు తిన్న లాభాలన్నీ ఏమయినై? వ్యాపారంలో ప్రతి దమ్మిడీమీదా లాభమే వస్తుందా? ఏ నెల రాబడికన్నా ఖర్చు జాస్తయితే ఆ నెల ఐ. పీ. దాఖల్ చేస్తారా? ఇది వ్యాపారంచేసే మొహమేనా? పదేళ్ళనుంచి అంతులేనిలాభాలు తిన్నారే, జీతాలివ్వలేని పరిస్థితి అనగా అర్థమేమిటి?" నారాయణమూర్తి అరుస్తున్నాడు.

"ఊరుకో నీకు పుణ్యముంటుంది. ఎవరన్నా వినగల్రు."

"విననీ, ఇందులో రహస్యమేముంది. ఈ ముండమోపి ఉద్యోగానికి మూడుసార్లు రాజీనామా ఇచ్చా. మూడుసార్లు బతిమాలి కాగితం చించేయించారు. యేముంది వెధవ బ్రతుకు. అందితే జుట్టూ, అందకపోతే కాళ్లూను!"

నారాయణమూర్తి అట్లా మాట్లాడగల్గటం కోటేశ్వర్రావు కేదో కొత్తబలం వచ్చినట్టయింది.

"కొంచెం పరిస్థితి బాగుపడితే మళ్ళీ పిలిపిస్తానన్నారు. నిజమైనా, అబద్ధమైనా కాస్త మర్యాదగా బయటికి పోతున్నా, అంతేచాలు!" అన్నాడు కోటేశ్వర్రావు.

"ఈ మర్యాదల కేంలే? ఇటువంటి శుష్కప్రియాలకు డబ్బు ఏగానీ ఖర్చు లేదుగా!"

"ఏదో మూడునెల్ల జీతం ఇచ్చారు. అదే బోనస్సనుకుంటా!"

కోటేశ్వర్రావు డ్రాయరులోఉన్న తనసొంత కాగితాలూ, వస్తువులు తీసేసుకుని డ్రాయరు మూసి తాళంచెవులు శ్రీరాములుకిచ్చేసి అందరి దగ్గిరా సెలవు పుచ్చుకుని బయలుదేరాడు. అతని మనసు ఎంత వేగంగా జారుతున్నదో మనం ఊహించవచ్చు. ఈ అయిదునిమిషాల క్రితంకూడా తనకూ, ఈ ఆఫీసుకూగల దృఢబంధాలను

గురించి ఆలోచించి, ఇవి ఎట్లా తెగుతాయా అని ఆశ్చర్యపోతున్న కోటేశ్వర్రావుకు ఇప్పుడీ ఆఫీసు చాలా కాలం క్రితం ఖాళీ చేసిన ఇల్లులా ఉంది. వీధిలోకిరాగానే కోటేశ్వర్రావుకు మొట్టమొదట కలిగిన భావం ఆనందం. గాను గెద్దుకు స్వేచ్ఛ! ఈ వేళప్పుడు తాను నిష్పూచీగా వీధిలోఎన్నడూ తిరగలేదు. తిరిగే స్వేచ్ఛ లేక పోయింది. జేబులో ఏడువందల రూపాయలు మాత్రం అతని జేబులో ఎన్నడునైన్నా?

అతనికి ఇంటికి పోబుద్ధి పుట్టలేదు. ఇది ఏకాంతంగా కూర్చుని ఆత్మపరీక్ష చేసుకోవలసిన సమయం. పార్కు ప్రశాంతంగా ఉంటుంది. అటుకేసి బయలు దేరాడు. అతని తలకాయలో ఆలోచనలు చీమలపుట్టలో చీమల్లాగా చిందరవందరగా పరుగెత్తుతున్నాయి. వాటిని ఒక మార్గానికి తిప్పుకోవాలి.

ఇదేదో తనమంచికే వచ్చింది. నెల నిండకుండానే నెలజీతమూ, మూడునెల్ల బోనసు ఇచ్చారు. పిచ్చి ముండాకొడుకులు! ఒకటో తారీఖుకల్లా మళ్ళీ ఉద్యోగం సంపాదించాలి. ఈ డబ్బులో కనీసం అయిదు వందలన్నా బ్యాంకులో వెయ్యాలి. వీటిని మదుపు పెట్టి ఆట్టే శ్రమలేకుండా లాభసాటిగా చేసుకునే సైడు వ్యాపారం ఏదన్నా చెబుతాడేమో రమణరావు నడగాలి.... ఈ డబ్బంతా తీసుకొని రైలెక్కి రెండు నెల్లపాటు దేశమంతా తిరగేస్తే? ఛీ! పెళ్ళాం పిల్లలేమౌతారు? ప్రతివాళ్ళకి ఈ పెళ్ళాం పిల్లలొక సమస్యే గదా! వాళ్ళ వైపునుంచి చూసినా సమస్యే. మరి ఇంతమంది ప్రాణులు ఒక్కడి సంపాదనమీద ఆధారపడట మేమిటి? అర్థం లేదు. ఈ సంపాదించేవాడు నిరుద్యోగి అయిపోవచ్చు, చావొచ్చు. సీతారామయ్య కుటుంబం గతి ఏమయింది; ఏడెనిమిది వందలు తెచ్చుకుంటూ మహారాజల్లే బతుకుతున్నవాడు కాస్తా గుండెఆగి చచ్చాడు. ఉత్తరక్రియలకుకూడా డబ్బు లేదు. ఇంట్లో ఉన్న సామానంతా అయినకాడికి తెగనమ్మారు. ఇప్పుడు సీతారామయ్య భార్యా, ఆరుగురు పిల్లలు దిక్కులేని పక్షులు!.... చావన్నది ఎప్పుడొస్తుందో ఎవరు చెబుతారు? తాను ఇంటికి చేరిందాకా నమ్మకం ఉందా ఏమిటి? ఏ బండికింద పడ్డా పడవచ్చు. జనం మూగుతారు. తనశవాన్ని ఎవరూ గుర్తించలేరు. పోలీసులు వచ్చి జేబులు పరీక్షిస్తారు. కవరు దొరుకుతుంది. అందులో డబ్బంతా కొట్టేస్తారు. కనీసం తాను ఫలానా అని అయినా తెలుస్తుంది. తాను చచ్చిపోయినట్టు తెలియగానే అందరూ ఆత్మహత్య కాబోలునను కుంటారు. మేనేజరే మనుకుంటాడో? ఎందుకు తీసే శానా అని విచారించక పోతాడా, నిద్రపట్టక, అన్నం సయించక చావనీ? అంతే కావాలి....

పెద్ద చప్పుడుతో కారొకటి కోటేశ్వర్రావు వెనకగా ఆగింది. ఉలిక్కిపడి కోటేశ్వర్రావు పక్కకు తప్పుకున్నాడు. కారు డ్రైవరు కోటేశ్వర్రావును తిట్టు కుంటూ గియరుమార్చి కారును తోలుకుపోయినాడు. అదురుతున్న గుండెతో కోటేశ్వ ర్రావు ఆ కారు కేసిచూశాడు. అతని ఆలోచనలన్నీ డీ డీ కొట్టినట్టుగా మాయ మయినై.

తుపాను భీభత్సంలో సముద్రం మీది ఓడ ఏ క్షణాన ఏ దిక్కుగా పోతుందో తెలియదు. కోటేశ్వర్రావు అనుకున్న దానికన్న చాల తొందరగానే ఇల్లు చేరాడు. భార్య ఆశ్చర్యపడింది. జరిగినది తెలుసుకొన్నది. అడగవలసినమాట అడిగింది.

"డబ్బు లేకపోతే మిమ్మల్నే ఎందుకు తీసెయ్యాలి? పని పాడుచేసిఉంటారు. నాకు మొదట్నుంచీ తెలుసు, ఈ ఉద్యోగం దక్కించుకోలేరని; సాటివాళ్ళంతా నిక్షేపంగా ఉద్యోగాలు చేసుకుంటూంటే మీరు రోజూ ఉద్యోగం యిచ్చినవాళ్ళని తిట్టిపొయ్యటమె నాయె!"

గోరుచుట్టుమీద రోకటిపోటు పడ్డా కోటేశ్వర్రావు మాట్లాడలేదు. నారాయణమూర్తి నలుగురితోనూ అనే మాటలు కోటేశ్వర్రావు భార్య దగ్గర అంటూండేవాడు. "ఈ ప్రపంచంలో ఒకరు ఉద్యోగాలిచ్చేవాళ్ళు ఒకరు పుచ్చుకునేవాళ్ళు ఉన్నంత కాలం జీవితం ఇంతే. ఆ ఇచ్చేవాళ్ళకు నీద్వారా లాభాలువచ్చే అవకాశం లేకపోతే నీకు తిండితినే యోగ్యత లేదు. ఇదంతా పోతుందిలే చూస్తూవుండు" వగైరా.

కాని ఈ మాటలకు కోటేశ్వర్రావు భార్య ఎన్నడూ చలించలేదు. వాళ్ళ ధర్మమా అంటూ ఇంత పని చూపించి నాలుగు రాళ్ళిస్తుంటే నోరు మూసుకుని పని చెయ్యక ఈ ఉపన్యాసాలన్నీ దేనికని ఆవిడ వాదం. బాగుపడే వాళ్ళంతా తన వైఖరే అవలంబిస్తున్నారని ఆవిడ విశ్వాసం. కోటేశ్వర్రావు ఉద్యోగం ఊడడంతో ఆవిడకు అఖండ విజయం. "నా భార్య నామీద గెలవటానికి నేను అనుభవించవలసినది ఇదా! హుం!" అనుకున్నాడు కోటేశ్వర్రావు ఆత్మగతంగా మాత్రమే.

"చూస్తుండవే! మూడు నెలల జీతం బ్యాంకులోవేసి రేపాటికి దీని బాబులాటి ఉద్యోగం సంపాయిస్తాను" అన్నాడు.

"అయితే డబ్బు ఎవరికీ కాకుండా బ్యాంకులో దేనికి. నాకో దండ చేయించండి" అన్నది భార్య.

ఆపత్సమయంలో తన ధర్మపత్ని ఇంతమాట అడుగుతుందని కోటేశ్వర్రావు కలలో కూడా అనుకోలేదు.

"దండా!" పైన మాటకూడా పెగల్లేదతనికి.

"ఏం పర్వాలేదు. ఎప్పుడు కావాలన్నా మార్చుకొని డబ్బు చేసుకోవచ్చు."

"ఇంకా నయం!" అన్నాడు కోటేశ్వర్రావు.

ఉద్యోగం పోవడం విషయమై తన మనస్సు ఏదోఒకవిధంగా సరిపెట్టుకుందని కోటేశ్వర్రావు మొదటిరోజుల్లో చాలాసార్లు అనుకున్నాడు. కాని అతని మనసు ఊగుడు ఇంకా ఆగనేలేదు. ఒకసారి ఇది తన మంచికే వచ్చిందనిపించేది. మరోసారి ఇకతనకు మళ్ళా జీవితంలో ఉద్యోగం దొరకదనిపించేది. ఒకసారి తాను చేయదగినది ఏమీ లేదనిపించేది. ఇంకోసారి చేసేదేమైనాఉంటే దానికింకా తొందర లేదనిపించేది. మరుక్షణమే తాను అఘాతం ఒడ్డున ఉండికూడా తన క్షేమంకోసం ఏమీ పాటుపడటం లేదనిపించేది. ఒకసారి ఉన్నడబ్బు పూర్తిగా ఖర్చుపెడదామనిపించేది, మరోసారి

ఇప్పటినుంచే ప్రతి దమ్మిడీ భద్రంగా ఖర్చు పెట్టకపోతే చాలా ప్రమాదమనిపించేది.

ఉద్యోగం పోయిన మూడోనాడు శ్రీరాములు ఇంటికి వచ్చాడు. "నిన్ననే మూడు వందల జీతంమీద కొత్తవాణ్ణి వేశారు. వాడి ఫోజు భరించలేక చస్తున్నాం!" అన్నాడు.

"ఓహో, అట్లాగా?" అన్నాడు కోటేశ్వర్రావు నిర్లిప్తంగా. కాని, లోపల అతని మనస్సు రోదిస్తోంది. తన భార్య అన్నమాట నిజమై ఉండాలి. తన పని వాళ్ళకి నచ్చకే తీసేశారు. డబ్బు లేదన్నది సర్వాబద్ధం. తాను ఉద్యోగానికి పనికి రాడన్న భావము వాళ్ళ కెంతకాలం నుంచీ ఉందో! కొత్తవాడిమీద నిజంగా వాళ్ళకు చాల గొప్ప అభిప్రాయం ఉండాలి. మళ్ళీ ఆలస్యమైతే వాడు రాడేమో అని నెలకాక పూర్వమే తనకు ఉద్వాసన చెప్పారు! తానింత పనికిమాలినవాడినైతే ఇంకొకరిని మాత్రం ఉద్యోగం ఇమ్మని అడిగేదెట్టా? ఉద్యోగాలిచ్చే వాళ్ళకి తానెట్లా కనిపించేదీ తెలిస్తే బాగుణ్ణు, అనుకున్నాడు కోటేశ్వర్రావు. కాని అటువంటి జ్ఞానం ఎవరికి సాధ్యమవుతుంది?

దీనితోబాటు కోటేశ్వర్రావుకు తన నిరుద్యోగం గురించి ఇతరు లేమనుకుంటున్నారో తెలియలేదు. మనని ఎరుగున్నవాళ్ళలో మనకు నిజంగా ఆసరాగా ఉండే వాళ్ళెందరో ఆపత్సమయంలోగాని తెలీదు. చాలామంది అతని ఉద్యోగం పోవడం గురించి "ఓహో, అట్లాగా?" అన్నారు. ఈ వార్త వాళ్ళ జీవితాలకు ఏ విధంగానూ సంబంధించినది కానట్టు. కొందరుమటుకు సలహాలిచ్చారు, వీరిని కలుసుకోమనీ, వారిని కలుసుకోమని, ఈ ఉద్యోగానికి దరఖాస్తులు పెట్టమనీ. కోటేశ్వర్రావు అడ్డమైన ఉద్యోగాలకి దరఖాస్తులు పెట్టాడు. కొందరు "నువ్వుండు, నీకు క్షణంలో ఉద్యోగం దొరికేట్టు నేను చూస్తాను" అనికూడా అన్నారు. కాని వాళ్ళు చూడలేకపోయినారనుకోవాలి.

జూన్‌మాసం గడిచింది. జూలై కూడా వెళ్ళింది. ఆగస్టువచ్చింది. స్వాతంత్ర్య దినంనాడు కోటేశ్వర్రావు సర్వస్వతంత్రుడై ఉన్నాడు.

తన ఉద్యోగం పోయిననాడు అంత అనాలోచితంగా మాట్లాడిన భార్య ఈ కొద్ది నెలల్లో ఎట్లా మారిపోయిందో చూసి కోటేశ్వర్రావు ఆశ్చర్యపడ్డాడు. కోటేశ్వర్రావు కంటె కూడా ఆమె దారిద్ర్యాన్ని శీఘ్రంగా ఆమోదించింది. పాలూ, నెయ్యీ, కూరలూ, వేణ్ణీలూ మొదలైనవి తగ్గించేసింది. చేతిలో ఉన్నడబ్బు తరిగిపోతోంది. ఆంధ్ర రాష్ట్రం కోసం దీక్షపట్టి నిరశనం చేసిన పొట్టి శ్రీరాములు తన శరీరపు కొవ్వు కండరాలమీద జీవించినట్టు కోటేశ్వర్రావు కుటుంబం తనను తానే ఆహుతి చేసికోసాగింది.

మార్చిలో పిల్లల చదువులు అయిపోయి కొంత ఖర్చుతగ్గేనాటికి బరువు కొంత దిగితే కలిగే ఆనందాన్నికూడా కోటేశ్వర్రావు అనుభవించే స్థితిలోలేడు. అందరి

బట్టలు ఏనాడో చిరుగులు పట్టాయి. కొత్తబట్టల్కు లేవు. ఇంట్లో తమ అవసరాలకు మించిన సామానున్నట్టు తెలుసుకొని కోటేశ్వరరావు భార్య క్రమంగా అమ్మసాగింది. వాటిని కొన్నవాళ్ళు చాలా లాభసాటి వ్యాపారం చేసుకున్నారనీ, కోటేశ్వరరావు దారిద్ర్యం వాళ్ళకి—కళేబరములు గద్దలకు లాభించినట్టు-లాభించిందనీ తెలియజేయటానికి సంతోషిస్తున్నాను.

అన్నిటితోబాటు కోటేశ్వరరావుకు, భార్యకు, పిల్లలకు మధ్యగల సంబంధాలు కూడా నిరుద్యోగ వ్రతానికి ఆహూతి కాసాగాయి. పిల్లలకిప్పుడు కోటేశ్వరరావంటె తమకు కావలసినవి తెచ్చిపెట్టేవాడు కాడు. తల్లంటే వంటింట్లోకి పిలిచి రకరకాల వస్తువులు వొద్దనేదాకా మెక్కబెట్టే మనిషి కాదు. కోటేశ్వరరావుకూడా పిల్లల్ని చూసి ఒక్కసారి ఆశ్చర్యపడేవాడు. "ఎట్లో పడ్డవాళ్ళన్నా మిగిలినవాళ్ళ విషయం మానేసి తాము ఒడ్డుకు చేరే సంగతి ఆలోచిస్తారు కాని ఈ జీవితంలో భార్యాబిడ్డలు అట్లాకాదు. వీరు మారుమాటాడకుండా నాతో చస్తారుకాని నన్ను విడిచిపోరు" అనుకునేవాడు.

జీవితమే దూరమైపోతున్నట్టు కనిపించింది కోటేశ్వరరావుకు. ఉద్యోగం పోయిన కొత్తలో తేదీలు లెక్కపెట్టేవాడు. తరువాత నెలలు లెక్కించాడు. ఇప్పుడు నెలలక్కూడా అర్థం లేకండా పోయింది. రైలు పట్టాల పక్కన నిలబడితే దగ్గర పట్టాల మధ్యగీతలూ, అడ్డచెక్కలూ, పట్టాలతాలూకు ఫిష్ప్లేట్లూ కనిపిస్తాయి. దూరం పోయినకొద్దీ ఈ వివరాలు తెలీవు. అవును, జీవితం అతనికి దూరమైపోతున్నది.

ఒకనాడొక పెద్దమనిషి కాఫీ హోటల్లో సుష్టుగా భోంచేసి బయటికి వస్తూ చటుక్కున ఆగిపోయాడు. ఆయన కళ్ళకు విచిత్రమైన ఆకారం ఒకటి కనిపించింది. ఆ ఆకారాన్ని కోటేశ్వరరావును గుర్తించి ఆ పెద్దమనిషి ఆగి "ఏమిటిది?" అన్నాడు.

కోటేశ్వరరావు ఏమీ అనలేకపోయాడు.

"జబ్బు చేసిందా?"

"ఒకటే జబ్బు, నాలుగు రోజులుగా ఇంట్లో అందరం పస్తే!" కోటేశ్వరరావు మొహానికి చినిగిన చొక్కా అడ్డం పెట్టుకునే పాటి మానవత్వం ఇంకా మిగిలినందుకు కోటేశ్వరరావును మనం అభినందించుతాం.

"ఇదిగో!" అన్నాడు పెద్దమనిషి అంతా విని. ఒక రూపాయి తీసిఇస్తూ, "నేను బుధవారం మళ్ళీ వస్తా, అప్పుడు కలుసుకుంటా. ఇల్లెక్కడ?"

పెద్ద మనిషి రాసుకున్నాడు.

ఆయన బుధవారం రావటం పడలేదు. శుక్రవారం వచ్చాడు. కాని పని తొందరలో కోటేశ్వర్రావు మాట జ్ఞాపకం లేదు.

రెండు నెల్లు గడిచాయి. ఆ పెద్దమనిషి ఈసారి జ్ఞాపకం పెట్టుకొని కోటేశ్వర్రావిచ్చిన ఎడ్రసుకు వెళ్ళాడు. కోటేశ్వర్రావు కుటుంబం ఆ యిల్లు వదలి పోయింది.

"ఎక్కడికి చచ్చారో నాకు సూత్రం ఏం తెలుసు. మూడునెల్ల అద్దె ఎగ్గొట్టి, గెంటిస్తేగాని బయటకు పోలేదు. కూరలవాళ్ళకి, పాలవాళ్ళకి, అందరికీ బాకీలు పడ్డాడు. చెప్పలేక చస్తున్నా. ఇంతమంది డబ్బు తిన్నాక ఇంతమంది ఉసురు తగలకుండా ఉంటుందా?" అన్నాడు ఇంటి యజమాని.

—ముద్రణ : విశాలాంధ్ర; 1. అక్టోబరు, 1953